క్లుప్తంగా

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: వర్షంలో సైతం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించి అమ్మవారికి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే రాముకు కొండలమ్మ ప్రసాదం



గుడ్లవల్లేరు: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుట్టిన రోజును పురస్కరించుకుని శ్రీ కొండలమ్మ అమ్మవారి చిత్ర పటంతో పాటు ప్రసాదాలను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆదివారం అందించారు. ఎమ్మెల్యే రామును ఆలయ అర్చకుడు శరత్చంద్ర ఆశీర్వదించారు.

జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక



గుడివాడ టౌన్: జాతీయ స్కేటింగ్ హాకీ పోటీలకు కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ ఆదివారం తెలిపారు. డిసెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకు కొయంబత్తూర్‌లో జరగనున్న జాతీయ స్కేటింగ్ హాకీ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారన్నారు. తమ పాఠశాలకు చెందిన క్యాడెట్ బాలుర విభాగంలో డి. జోహిత్‌వర్మ, ఎం. రిషాంత్, క్యాడెట్ బాలికల విభాగంలో జి. దివిష, పి. కారుణ్య, సబ్ జూనియర్ బాలుర విభాగంలో ఎస్ఎస్ అభిలాష్, బాలికల విభాగంలో ఇ. నిఖిల ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను కోచ్ పీఎస్‌వీఎస్ అయ్యప్పలను పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎం.సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి పాల్గొన్నారు.

అన్నదానం



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఆదివారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వడ్లమూడి గౌతమేశ్వరరావు స్మారకార్థం నిర్వహించారు. లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



కలిదిండి (కైకలూరు): ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా పేట కలిదిండి సచివాలయ వద్ద ఆదివారం ఏఎన్ఎం కల్యాణి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు, పోషకాహారం తీసుకుంటే వారి జీవితకాలం పెరుగుతుందన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ మహిళారూప, హెల్త్ అసిస్టెంట్ రమణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోతుల మయంగా పామర్రు ప్రధాన రహదారి



పామర్రు: పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి గోతుల మయంగా మారటంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. రహదారిలో పెద్ద గోతులు ఏర్పడి ఉండటంతో వాహనాలు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి వేళల్లో వాహనచోదకుల బాధలు వర్ణనాతీతం. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్రపు డెక్కను తొలగించరా?

• పంట కాలువలో ముందుకు సాగని నీరు • పట్టించుకోని అధికారులు



రాపర్లలో గుర్రపు డెక్కతో నిండిన దగ్గుమిల్లి మెయిన్ చానల్ పంట కాలువ

పామర్రు: స్థానిక బందరు కాలువ నుంచి రాపర్ల, జమీదగ్గుమిల్లి, పోలవరం, ఉంద్రపూడి గ్రామాల్లో పంట పొలాల సాగుకు ఏర్పాటు చేసిన దగ్గుమిల్లి మెయిన్ చానల్లో గుర్రపు డెక్క పెరిగిపోయి నీరు ముందుకు సాగడం లేదు. దీంతో దిగువున ఉన్న పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ చానల్ కింద సుమారు 1,200 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ చానల్ సుమారు 3.5 కిలోమీటర్ల ప్రయాణించి ఆయా గ్రామాల పంట పొలాలకు సాగు నీరు అందిస్తుంది. ఈ చానల్లో గుర్రపు డెక్క, నాచు విపరీతంగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. చానల్ ద్వారా చివరి వరకు పంట పొలాల వరకు సాగునీరు అడ్డంకుల కారణంగా చేరటం లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బందరు కాలువ ద్వారా వచ్చే సాగునీరు చానల్ ద్వారా ఆయా గ్రామాలకు సాగునీరు అందించాలి. అయితే గుర్రపుడెక్క నిండిపోయి ఉండటంతో దిగువకు నీరు ప్రవహించడం లేదు. దీంతో సాగుకు నీరు సక్రమంగా అందక అవస్థలు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చానల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తదితరాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

పచ్చిగడ్డికి వేలం పాట

దగ్గుమిల్లి మెయిన్ చానల్ బాగోగులు పట్టించుకోని అధికారులు ఆ చానల్ గట్లపై పెరిగిన పచ్చిగడ్డికి మాత్రం వేలం పాటలు నిర్వహించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కనీసం చానల్లో పేరుకుపోయిన డెక్కను తొలగించాలనే ఆలోచన కూడా అధికారులకు లేకపోవడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చానల్లో పోలవరం వద్ద గేట్లు వేయించారు. ఒక్క ఏడాది కూడా కాకుండానే వాటిని తొలగించారు. మళ్లీ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీని వలన వచ్చే నీరు కొంత వృథాగా పోతోందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గుర్రపు డెక్కను తొలగిస్తాం

దగ్గుమిల్లి మెయిన్ చానల్లో పెరిగిపోయిన గుర్రపు డెక్క, తూడు కాడలను సత్వరమే తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– ఆదిక్, ఇరిగేషన్ జేఈఈ, పామర్రు


సాగుకు ఇబ్బందిగా ఉంది



దగ్గుమిల్లి మెయిన్ చానల్లో అడ్డంకుల కారణంగా సాగుకు ఇబ్బందులు పడుతున్నాం. 2.5 ఎకరాలు సొంతంతోపాటు 1.5 ఎకరాల కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. కాలువ ద్వారా పొలాలకు సాగు నీరు సక్రమంగా చేరడం లేదు. దీంతో సాగు చేయలేకపోతున్నా. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– కాకర్ల శ్రీనివాసరావు, రైతు, రాపర్ల

చానల్‌ను బాగు చేయాలి



దగ్గుమిల్లి మెయిన్ చానల్లో గుర్రపు డెక్క, తూడు కాడ తదితరాలతో నిండిపోయింది. దీని వలన సాగుకు నీరు అందడం లేదు. అధికారులు స్పందించి చానల్‌ను అభివృద్ధి చేయాలి. చానల్‌ను పట్టించుకున్న వారే లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– కె.జనార్దనరావు, రైతు, రాపర్ల

నేలవాలిన వరి

ఆందోళనలో రైతులు



నేల వాలిన వరి పంట

పామర్రు: తుపాను ప్రభావంతో మండలంలో కురిసిన వర్షాలు, వీచిన గాలులకు వరి పైరు నేల వాలింది. మండలంలోని రాపర్ల, జమీదగ్గుమిల్లి, పోలవరం, ఉంద్రపూడి, పామర్రు, కొండిపర్రు తదితర గ్రామాల్లో వరి పైరు నేల వాలింది. మండలంలో 23,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఇప్పటి వరకు సుమారు ఐదు వేల ఎకరాల్లో మిషన్ల ద్వారా నూర్పిళ్లు పూర్తి చేశారు. మిగిలిన వరి పంట కోత దశలో ఉంది. తుపాను కారణంగా వీచిన గాలులకు వరి పంట నేల వాలింది. ఆయా గ్రామాల్లో 60 శాతం వరకు వరి పంట వాలిపోయిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు స్పందించి తగు సూచనలు సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

వర్షంతో రైతుల బెంబేలు



మొవ్వ మండలంలో వర్షానికి తడిసిన వరి పనలు

మొవ్వ: తుపాను ప్రభావంతో వీస్తున్న గాలులు, కురుస్తున్న వర్షానికి వరి పైరు దెబ్బతినడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కోత కోసి పనల మీద ఉన్న వరి తడిసిపోవడంతో నష్టం తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వీసిన గాలులకు కొన్నిచోట్ల వరి పైరు చాపచుట్టమాదిరిగా పడిపోయింది. ఈ పైరును యంత్రంతో కోయిలేని స్థితి. కూలీలతో కోయించాలంటే చాలా ఖర్చు అవుతుందని బాధిత రైతులు చెబుతున్నారు.

10 ఎకరాలు నేల వాలింది

మా గ్రామంలో 15 ఎకరాలు వరి సాగు చేస్తున్నాను. తుపాను కారణంగా వీచిన గాలులకు 10 ఎకరాల్లో వరి పంట నేల వాలింది. ఈ పంటను ఏ విధంగా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు. వ్యవసాయశాఖ అధికారులు స్పందించి తగు సూచనలు ఇవ్వాలి.

– తోట గంగాధరరావు, రైతు, ఉంద్రపూడి

ప్రభుత్వం ఆదుకోవాలి

మా గ్రామంలో 10 ఎకరాలు వరి సాగు చేస్తున్నాను. తుపాను ప్రభావంతో వీచిన గాలులతో వరిపైరు నేలకొరిగింది. దీంతో దిక్కు తోయడం లేదు. ప్రభుత్వం స్పందించి నేల కొరిగిన పంటను పరిశీలించి, తగు విధమైన న్యాయం చేయాలి.

– కూనపరెడ్డి నాగేశ్వరరావు, రైతు, ఉంద్రపూడి

అమరేశ్వరుని సన్నిధిలో దీపోత్సవం



గుడ్లవల్లేరులో శివ లింగాకారంలో దీపార్చన



గుడ్లవల్లేరులో సర్వాలంకార భూషితుడై దర్శనమిచ్చిన అమరేశ్వరుడు

గుడ్లవల్లేరు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని అంగలూరు అమరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామ ఉప సర్పంచ్ త్రిపురనేని సురేష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కార్తిక దామోదర పూజలను ఆలయ అర్చకులు పాలపర్తి నరసింహారావు, నాగ వెంకట సత్యనారాయణ చేపట్టారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ ఆర్.వి.ఎల్.నరసింహారావు, త్రిపురనేని హితేష్ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: కార్తికమాసం చివరి రోజు సందర్భంగా ఆదివారం శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. లింగాల, అయ్యవారిరుద్రవరం, శోభనాద్రిపురం, అల్లినగరం విశ్వేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అలరించిన ఘంటసాల సంగీత విభావరి



నవరసాల నందమూరి తేటగీతుల పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుమార్ రాజా

పమిడిముక్కల: పద్మశ్రీ ఘంటసాల–పద్మశ్రీ ఎన్‌టీఆర్ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం మంటాడ ప్రాథమిక పాఠశాల్లో ఘంటసాల జయంతి సందర్భంగా 102 పాటలతో సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. 15 మంది గాయకులు ఘంటసాల పాటలతో అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కళాపీఠం సేవలను కొనియాడారు. 102 పాటలు పాడిన కళాపీఠం వ్యవస్థాపకులు కాటూరు మురళీకృష్ణ, గాయకులను సత్కరించారు. అనంతరం నవరసాల నందమూరి తేటగీతుల పద్యశతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, సర్పంచ్ నందమూడి వీరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, కళాపీఠం గౌరవాధ్యక్షుడు మోటేపల్లి బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరాలు



ఏఎన్నార్ కళాశాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుడివాడ టౌన్: పట్టణంలో ఆదివారం రెండు మెగా ఉచిత వైద్య శిబిరాలు జరిగాయి. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి కాజా వెంకట్రామయ్య జ్ఞాపకార్థం పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యబృందం ఆధ్వర్యంలో గుండె, నరాలు, మెదడు, కిడ్నీ, ఎముకలు, కీళ్లు, యూరాలజీ, గైనిక్ విభాగాల్లో వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి జీఎం శ్రీను చౌదరి, కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ..

రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందంచే ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులకు చెందిన 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్‌బాబు, వైద్యులు డాక్టర్ కె. ధనుష్, డాక్టర్ సీహెచ్ అశోక్, డాక్టర్ వై.గణేష్, డాక్టర్ ఎం.తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావ సభను జయప్రదం చేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ తదితరులు

పామర్రు: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో 2025 జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ అన్నారు. స్థానిక అరండాల్‌పేటలోని రామాలయంలో వీహెచ్‌పీ సమీక్ష సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు సంఘటితంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ శంఖారావం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హైందవ శంఖారావం సభ గురించి ప్రతి గ్రామంలో వివరించి వారిని సభకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి హిందువు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం హైందవ శంఖారావం వాల్ పోస్టర్‌ను స్థానికులతో కలిసి ఆవిష్కరించారు. ప్రఖండ అధ్యక్షుడు ఆరిగెల బాలుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వర్రె రాజశేఖర్, ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, సోమవరపు రామారావు, పీఎంఎస్ ప్రసాద్, సుబ్బారావు, కొండలు, రాము, అప్పారావు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి



కోరుకొల్లులో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

కైకలూరు: తుపాను కారణంగా వ్యవసాయ రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా సూచించారు. నియోజకవర్గంలోని కైకలూరు మండలం వేమవరప్పాడు, కలిదిండి మండలం కోరుకొల్లు, ముదినేపల్లి మండలం వడాలి, అప్పారావుపేట గ్రామాల్లో ఆరుబయట ధాన్యపు రాశులను ఆదివారం ఆయన పరిశీలించారు. తుపాను ప్రభావం కొనసాగుతున్నందున కోతలు కోయవద్దని రైతులకు సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కొరుకొల్లులో కొందరు పీఏసీఎస్‌ల నుంచి పట్టాలను బయటకు ఇవ్వడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పరిష్కరిస్తానని వ్యవసాయాధికారి బాషా తెలిపారు. కైకలూరు ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, కైకలూరు, మండవల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు, జి.వెంకటరమణి, మండల వ్యవసాయాధికారులు విద్యాసాగర్, వేణుమాధవ్, దివ్య పాల్గొన్నారు.

మల్లన్నకు భస్మాభిషేకం



మండవల్లి: కార్తికమాసం ఆఖరి రోజు పురస్కరించుకుని స్థానిక భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ఆదివారం భస్మాభిషేకం నిర్వహించారు. అర్చకులు గూడూరు భవానీశంకర్‌శాస్త్రి, ద్వాదశి కామేశ్వరశర్మ, భరద్వాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఈఓ కొవ్వాడ దివ్యశ్రీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వరి గడ్డి మహా ప్రియం

వాతావరణంలో వచ్చిన మార్పులతో పల్లెల్లో రయ్...రయ్‌మంటూ వరి కోత యంత్రాలతో కోతలు కోయించేస్తున్నారు. దీంతో వరిగడ్డి కొరత ఏర్పడి పాడి పశువుల మేతకు కరువైంది. వరి గడ్డిని కొనాలనుకునే పాడి రైతులకు చుక్కలు కనపడుతున్నాయి. గతంలో ఎకరం వరి గడ్డి రూ.5 వేలు ఉండేది. ప్రస్తుతం రూ.10వేలతో కొనుగోలు చేద్దామన్నా కరువైపోయింది. కూలీలతో వరికోతలు కోయించిన కొద్దిపాటి వరి గడ్డి ఉన్నా.. లారీలతో బయట ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో స్థానికంగా పశుగ్రాస కొరత ఏర్పడింది.

– గుడ్లవల్లేరు

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

కైకలూరు: స్థానిక ఏలూరు రోడ్డు కాల్వ గట్టు సమీపంలో సంతాన నాగేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం నుంచి నాల్గో తేదీ వరకు నిర్వహించనున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త చావలి శంకరశాస్త్రి ఆదివారం తెలిపారు. బుధవారం ఉదయం ఉదయం 8.46 గంటలకు సంతాన నాగేంద్రస్వామి, శిఖర, నాగబంధ, మయూర వాహన ప్రతిష్ఠ కార్యక్రమాలను పుల్లేటికుర్తి గణపతిశర్మ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి అఖండ అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

22 మద్యం సీసాల స్వాధీనం

కైకలూరు: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆదివారం ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, కైకలూరు స్టేషన్ సిబ్బంది ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కలిదిండి మండలం పెదలంక గ్రామానికి చెందిన చిట్టుగుల్ల నాగరాజు, ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామానికి చెందిన దాసి మహేష్‌బాబు నుంచి 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రమేష్ తెలిపారు. దాడుల్లో కైకలూరు ఎస్ఐ పి.ఆంజనేయులు, కానిస్టేబుల్ భాస్కరరెడ్డి పాల్గొన్నారని పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



కైకలూరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి ప్రతీకలుగా నిలుస్తాయని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు మాట్లాడుతూ కైకలూరు ప్రాంతం వాలీబాల్ క్రీడకు పెట్టింది పేరు అని పేర్కొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 40 క్రీడా జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పి.కృష్ణ, ఎస్ఐ ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ టీషర్ట్‌ల ఆవిష్కరణ

కైకలూరు: క్రిస్మస్ టీషర్ట్‌లను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కైకలూరులో ఆదివారం ఆవిష్కరించారు. క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచించారు. రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి నీలం కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాలూకా సెంటర్‌లో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

పామర్రు: టూ వీలర్స్ మెకానిక్‌లకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు పామర్తి రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి, రెండో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 ఏళ్లు నిండిన మెకానిక్‌లకు పెన్షన్ అందించాలని కోరారు. ప్రతి ఒక్క మెకానిక్‌కు గుర్తింపు కార్డులతోపాటు ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని కోరారు. మెటీరియల్ కొనుగోలు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణాలను అందించాలన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగదుర్గా ప్రసాద్, కోశాధికారి గంగాధరరావు, ఉపాధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.